యువత కష్టపడి ఎదగాలి: వెంకయ్యనాయుడు



స్వర్ణ భారత్ ట్రస్టులో శిక్షణార్థులతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

శంషాబాద్ రూరల్: యువతరం కష్టపడి ఉన్నతస్థితికి చేరుకోవాలని, తిరిగి కొంతైనా సమాజానికి ఇవ్వాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్‌ట్రస్టు ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రోజూ సూర్య ప్రకాశంతోనే మన జీవితం ప్రకాశం అవుతుందని, ప్రకృతితో సమయం గడపాలన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. సరిహద్దుల వెంబడి పొరుగు దేశం పాకిస్తాన్ మన దేశంలోకి మాదకద్రవ్యాలను చొప్పిస్తోందన్నారు. పాకిస్తాన్ దుశ్చర్య కారణంగా పంజాబ్ మాదకద్రవ్యాలతో తీవ్ర ప్రభావానికి గురైందని, పట్టణాలు, గ్రామాల్లో మాదకద్రవ్యాల వాడకం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మనకున్న దాన్ని పది మందితో పంచుకోవాలని, తోటి వారి బాగును కోరుకోవడం సనాతన భారతీయ ధర్మమని చెప్పారు. ప్రకృతికి అనుగుణంగా మన జీవనశైలి ఉండాలని సూచించారు. తాజా ఆహారం, తృణ ధాన్యాలను తీసుకోవాలని, రసాయనాలు, ఎరువులు లేని కూరగాయలను పెరట్లోనో, మేడపైనో పండించుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలు, కష్టపడే తత్వం, సత్ప్రవర్తన, క్రమశిక్షణ, సమయపాలన ఉంటే ఎవరైనా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వెంకయ్యనాయుడు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, హైదరాబాద్ చాప్టర్ ఇంచార్జి డీవీఎస్.రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యమైందంటూ విద్యార్థులకు నో ఎంట్రీ

శంషాబాద్ రూరల్: కొద్ది నిమిషాల ఆలస్యానికి విద్యార్థులను స్కూల్ గేటు బయటే నిలబెట్టారు. అయితే ప్రిన్సిపాల్ తీరును నిరసిస్తూ రహదారిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వివరాలు... శంషాబాద్ మండలంలోని ఒయాసిస్ పాఠశాలకు మంగళవారం ఉదయం పలువురు విద్యార్థులు ఆలస్యంగా చేరుకున్నారు. అప్పటికే గేటుకు తాళం వేసిన సిబ్బంది.. వీరిని లోపలికి అనుమతించలేదు. దీంతో 50 మంది విద్యార్థులు గేటు బయటే నిలబడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు వచ్చి శంషాబాద్-షాబాద్ రహదారిపై ఆందోళనకు దిగారు. ఆ పాఠశాల బస్సులో అరగంట ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను మాత్రం లోపలికి అనుమతించారని అన్నారు. పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పారు. రెండు గంటల తర్వాత విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు.



ఒయాసిస్ పాఠశాల వద్ద రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం పాలాభిషేకం చేశారు. పాలనలో విఫలమైన సర్కారు విగ్రహాలు, కోడ్‌లను మార్చుకుంటూ ప్రజలను పక్కదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ ప్రజలు ఇప్పటికే విసిగెత్తిపోయారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయమ్మ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బి.సతీష్, మంచర్ల శ్రీనివాస్, మోహన్‌రావు, చరణ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



బండ్లగూడ చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రావుకోళ్ల నాగరాజ్ తదితరులు

బండ్లగూడ: తెలంగాణ తల్లిని అవమానపరిచి అరువు తెచ్చుకున్న కాంగ్రెస్ తల్లికి పట్టాభిషేకం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరల్లో ఉన్నాయని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రావుకోళ్ల నాగరాజ్ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో బండ్లగూడ చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్, శాంతినాయక్, వెంకటేష్, దుర్గేష్, సందీప్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు



రాజీవ్ గృహకల్పలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ రాజీవ్‌గృహకల్ప కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు, అపార్ట్‌మెంట్‌లోని నూతన ప్రహరీ, మౌలిక వసతుల కల్పన కోసం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఆయన ఆ ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రేణుక, వర్క్ ఇన్‌స్పెక్టర్ జియా, జీహెచ్‌ఎంసీ ఏఈ బల్వంత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, సూపర్‌వైజర్ వినయ్, డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్దన్, నాయకులు సచిన్ బబ్లూ, తలారి చిన్న, పాండుయాదవ్, అడికె శివ, ఎన్ను శంకర్, నందిని, పూజ, ఎస్‌ఎఫ్‌ఏ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికే పదవులు

అత్తాపూర్: ప్రజల్లో ఉంటూ కష్టపడి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కొండకళ్ల నాగేందర్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శాలువాలతో



సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

అవి నిరాధార ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌గౌడ్, రాంప్రసాద్‌రావు

బండ్లగూడ: నిరాధార ఆరోపణలతో తమను ఇబ్బందులకు గురిచేసేందుకు కొంతమంది యత్నిస్తున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ ప్రాంతానికి చెందిన హరీష్‌గౌడ్, రాంప్రసాద్‌రావు ఆరోపించారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాము ఏ పాపం చేయకముందే జైలుకు వెళ్తున్నారని ప్రచారం చేస్తున్నారన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఇలా ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. తాము ఇప్పటివరకు ఎవరినీ బెదిరించలేదని, దాడులకు పాల్పడలేదని అన్నారు. కొంతమంది తమపై కక్షపూరితంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

పోచమ్మ ఆలయంలో బీజేపీ నేతల పూజలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని రాళ్లగూడ పోచమ్మ దేవాలయంలో మంగళవారం బీజేపీ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పూజలు నిర్వహించిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎం. మహిపాల్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, శరత్‌యాదవ్, రవికాంత్‌రెడ్డి, రాజిరెడ్డి, వినోద్, రాజుయాదవ్, సాయికుమార్, స్థానికులు రాపోలు వెంకటేష్, మహేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, కొమ్మ పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

శంషాబాద్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలను పట్టణంలోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాల మైదానంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత తమకు ఇష్టమైన రంగాల్లో నైపుణ్యం సాధించేలా రాష్ట్ర సర్కారు ఇప్పటికే చర్యలు ప్రారంభించిందన్నారు. క్రీడారంగానికి రాష్ట్ర సర్కారు పెద్దపీట వేస్తోందన్నారు. అంతకుముందు మండలంలో 72 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు, మాజీ సర్పంచ్ ఆర్. గణేష్ గుప్తా, కౌన్సిలర్లు జహంగీర్ ఖాన్, పి.సంజయ్ యాదవ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

14న కురుమ ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవం



కురుమ ఆత్మగౌరవ భవనం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మణికొండ: ఈ నెల 14వ తేదీన దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మ గౌరవ భవన ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రానున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపల్ పరిధిలోని కోకాపేట్ వద్ద నిర్మించిన దొడ్డి కొమురయ్య కురుమ సంఘం భవన ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఎండీఏ, పోలీస్, మున్సిపల్ శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జరిగే సభలో పాల్గొనే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేష్, క్యామ మల్లేష్, డీసీపీ శ్రీనివాస్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, ఇతర కురుమ సంఘ ప్రతినిధులతో కలెక్టర్ కలిసి భవన పరిసరాలను, సభాస్థలిని పరిశీలించారు.

35 అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తున్న అధికారులు

బండ్లగూడ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలను మంగళవారం అధికారులు కూల్చివేశారు. ప్రధాన రహదారికి ఇరువైపులా నార్సింగి రాయల్ ఫంక్షన్‌హాల్ నుంచి గండిపేట్ చౌరస్తా వరకు ఉన్న 35 అక్రమ కట్టడాలను ఈ సందర్భంగా తొలగించారు. జాయింట్ యాక్షన్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ కూల్చివేతలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నిరంజన్‌రెడ్డి, ట్రాఫిక్ అడ్మినిస్ట్రేషన్ సీఐ ప్రదీప్, లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ మణిహారిక, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే అన్నారు.

వ్యక్తి అదృశ్యం



సుదర్శన్(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: వాచ్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన మ్యాడి సుదర్శన్(49) అత్తాపూర్‌లోని శికారా అపార్ట్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ వద్ద వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే ఈ నెల 5వ తేదీన ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి పనికి వెళ్లి రాత్రి 10 గంటలైనా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆయన ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆచూకీ కోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా, బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆయన జాడ తెలియలేదు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



షఫీ అహ్మద్(ఫైల్)

అత్తాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చింతల్‌మెట్‌లో నివాసం ఉండే షఫీ అహ్మద్(45) చిత్తుకాగితాలు ఏరుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడు ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన భార్య ఫిర్యాదు మేరకు 4వ తేదీన అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే సోమవారం చింతల్‌మెట్‌లోని ఓ ఇంటి దగ్గర నీటిసంపులో అతడు శవమై కనిపించాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఘటనాస్థలంలో మృతదేహం లభించిన తీరుబట్టి ఎవరైనా హత్య చేశారా..? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు.

12న మండలస్థాయి ఆటల పోటీలు



సీఎం కప్ మండలస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎంఈఓ శంకర్ రాథోడ్

రాజేంద్రనగర్: ఈ నెల 12న జడ్పీహెచ్‌ఎస్ శివరాంపల్లి పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, పరుగు పందెం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ మేరకు శివరాంపల్లి జడ్పీహెచ్ పాఠశాలలో మంగళవారం సీఎం కప్ మండలస్థాయి సమావేశం ఎంఈవో శంకర్ రాథోడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్.రంగారెడ్డి, కె.గాంగ్య నాయక్, జోనల్ ఇన్‌చార్జి జ్యోతి, బాలస్వామిరెడ్డి, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.



కన్నుల పండువగా పాస్టర్స్ ఫ్యామిలీస్ క్రిస్మస్ వేడుకలు

బండ్లగూడ: రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫ్యామిలీస్ క్రిస్మస్ వేడుకలు మంగళవారం కిస్మత్‌పూర్‌లోని రాక్‌చర్చి క్యాంపస్‌లోని మన్నా మిలేనియం వర్షిప్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కె.సుందర్‌పాల్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో మన్నా మినిస్ట్రీస్ కో ఫౌండర్ బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి బైబిల్ సందేశాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ జి.విజయభూషణం, రెవరెండ్ డాక్టర్ బీసీ పాల్, రెవరెండ్ పి.స్వర్ణకుమార్, పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ఈ.మనోహరం, కోశాధికారి రెవరెండ్ జె.పి.పాల్, ఉపాధ్యక్షుడు సి.హెచ్.సునీల్ శామ్యూల్, కార్యదర్శి ఎస్.రవికుమార్, కార్యవర్గ సభ్యులు ఎన్.రాజారాం, సామ్యూల్‌రాజ్, డి.ఆనంద్‌పాల్, కార్పొరేటర్లు సురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్, నాయకులు రగడంపల్లి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం మార్పుపై నిరసన



మణికొండలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేస్తున్న సీతారాం ధూళిపాళ తదితరులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో పూర్వ తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఉన్న విగ్రహాన్ని కాదని కొత్తగా మరో విగ్రహం తేవడం తగదని, ప్రభుత్వాలు మారినప్పుడల్లా తెలంగాణ తల్లి మారుతుందా అని అన్నారు. కాంగ్రెస్ పాలకులు కొత్తగా తెలంగాణ విగ్రహం తయారు చేయడాన్ని నిరసిస్తూ పాత తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంబగళ్ల ధనరాజ్, అందె లక్ష్మణ్‌రావు, గుట్టమీది నరేందర్, సంఘం శ్రీకాంత్, విఠల్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, బుదోలు బాబు, భానుచందర్, యాలాల కిరణ్, షేక్ ఆరిఫ్, రాజేంద్రప్రసాద్, బొడ్డు శ్రీధర్, విజయలక్ష్మి, మహేశ్వరం సుమన్, ప్రవీణ్, రాజు, శ్రీనివాసాచారి, తిరుపతి, మహేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలు మారిస్తే చరిత్ర మారదు

రాజేంద్రనగర్: తెలంగాణ తల్లి పేరు చెప్పి కాంగ్రెస్ తల్లి పేరుతో ప్రభుత్వం తీరని అపచారం చేశారని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పునకు నిరసనగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని డైరీఫామ్ చౌరస్తాలో మంగళవారం రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చే సుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్



ప్రభుత్వం మార్చిందన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు ప్రీతం రాజ్, నవీన్ కుమార్, కావేలిగూడెం గిరిబాబు, నరేశ్ ముదిరాజ్, టీఆర్‌ఎస్వీ ప్రెసిడెంట్ గౌతం, నరేందర్ రెడ్డి, ఆశ్వాక్, సారంగపాణి, శ్రీను కాకా, శివ, ఖాదర్, శ్రీనివాస్, జాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230